క్లుప్తంగా

9న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కొత్తపట్నం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 9వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీకృష్ణ తెలిపారు. మండల ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, జిల్లా ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు. అధికారులు వచ్చేటప్పుడు ఆయా ప్రగతి నివేదికలను సమావేశానికి తీసుకురావాలని కోరారు. గైర్హాజరైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో హెచ్చరించారు.

విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు

ఒంగోలు సిటీ: అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 74వ వార్షికోత్సవం సందర్భంగా ఒంగోలు మండల స్థాయిలో ఈ నెల 9వ తేదీ ఉదయం 10 గంటలకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సీనియర్స్‌కు భారత రాజ్యాంగం -ప్రాథమిక హక్కులు అనే అంశంలో, జూనియర్స్‌కు భగత్‌సింగ్ జీవిత చరిత్ర అనే అంశంలో ఉదయం వ్యాసరచన పోటీలు జరుగుతాయని చెప్పారు. అదేరోజు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు క్విజ్ పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీలకు నలుగురు సభ్యులు మాత్రమే ఉండాలని తెలిపారు. ఇతర వివరాలకు 9441269157 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు. అదేవిధంగా 11వ తేదీ ఉదయం 11 గంటలకు మ్యూజికల్ చైర్స్ పోటీలు సీనియర్స్, జూనియర్స్ విభాగాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 7382573182 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు. 12వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ముగ్గుల పోటీలు జరుగుతాయన్నారు. పూర్తి వివరాలకు ఉషారాణి (9491002232), సుజాత (9032438988)లను సంప్రదించాలని కోరారు.

హెల్త్ పెన్షన్లపై 16న వెరిఫికేషన్

మద్దిపాడు: మండలంలో అనారోగ్యంతో మంచాలకు పరిమితమై మెడికల్ పెన్షన్లు అందుకుంటున్న 23 మందిని ఈ నెల 16వ తేదీ డాక్టర్ల బృందం పరిశీలించనున్నట్లు ఎంపీడీవో వి.జ్యోతి తెలిపారు. మండలంలోని ఇనమనమెళ్లూరు, బసవన్నపాలెం, పెద్దకొత్తపల్లి, నేలటూరు, కొలచనకోట, మల్లవరం, దొడ్డవరం, అన్నంగి, గుండ్లాపల్లి, కీర్తిపాడు, ఘడియపూడి గ్రామాల్లో పరిశీలిస్తారని చెప్పారు. పెన్షన్‌దారుడు ఇంటి వద్ద లేకపోతే వారి పెన్షన్ నిలిపివేస్తారని ఎంపీడీవో స్పష్టం చేశారు.

సంతనూతలపాడు మండలంలో...

సంతనూతలపాడు: మండలంలో నేటి నుంచి ముగ్గురు డాక్టర్ల బృందం హెల్త్ పెన్షన్లను తనిఖీ చేయనున్నట్లు ఎంపీడీవో డి.సురేష్ బాబు తెలిపారు. పూర్తిగా మంచానికే పరిమితమైనవారు, పక్షవాతం, మానసిక వికలాంగులు తదితర వారిని ఆయా డాక్టర్ల బృందం పరిశీలించనున్నట్లు చెప్పారు. అందుకు సంబంధించిన సదరన్ సర్టిఫికెట్లను కూడా ఆ బృందం తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. మండలంలో 53 మంది హెల్త్ పెన్షనర్లు ఉన్నట్టు వెల్లడించారు. వారంతా ఇళ్ల వద్ద అందుబాటులో ఉండి డాక్టర్ల బృందానికి సహకరించాలని ఎంపీడీవో కోరారు.

సచివాలయ ఉద్యోగులకు రేపు ఆటల పోటీలు

మద్దిపాడు: సంక్రాంతి పండుగ సందర్భంగా సచివాలయ సిబ్బందికి ఈ నెల 8వ తేదీ నుంచి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి.జ్యోతి తెలిపారు. రంగోలి, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్స్, కబడ్డీ, టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు సచివాలయ కార్యదర్శి వద్ద పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.

రంజన్ మిశ్రాను కలిసిన పీఆర్ కమిషనర్ కృష్ణతేజ



ఏకసభ్య కమిషన్ చైర్మన్ మిశ్రాను మర్యాద పూర్వకంగా కలిసిన పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ

ఒంగోలు అర్బన్:

ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్, మాజీ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రాను సోమవారం గ్రీవెన్స్ హాలులో పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ మైలవరపు మర్యాద పూర్వకంగా కలిశారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం ఒంగోలులో ఏర్పాటు చేసిన జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న క్షేత్ర సహాయకులకు నిర్వహించిన శిక్షణలో పాల్గొనేందుకు కృష్ణతేజ ఒంగోలు వచ్చారు. ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఎస్సీ ఉపకులాలపై కుల సంఘాలు, ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషన్ చైర్మన్ మిశ్రాతో పాటు కలెక్టర్ తమీమ్ అన్సారియాను కృష్ణతేజ మర్యాద పూర్వకంగా కలిసి మాట్లాడారు.

కోతకొచ్చిన ఆశల పంట..!

- సంతనూతలపాడు నియోజకవర్గంలో జోరుగా పొగాకు కోతలు
- నియోజకవర్గంలో 3,490 హెక్టార్లకుపైగా పంట సాగు
- కొన్నేళ్లుగా లాభాలు వస్తుండటంతో ఎంతో ఆశగా పండించిన రైతులు



సంతనూతలపాడు:

వాణిజ్య పంటల్లో ప్రధానమైన పొగాకు సాగుపై ఈ ఏడాది రైతులు ఎక్కువ మక్కువ చూపారు. రెండుమూడేళ్లుగా పొగాకు ధరలు పెరిగి లాభాలు రావడంతో రైతులంతా ఎంతో ఆశగా సాగుచేశారు. ప్రస్తుతం పంట కోతకు రావడంతో సంతనూతలపాడు నియోజకవర్గంలోని రైతులు, కూలీలంతా పొగాకు కోత పనుల్లో నిమగ్నమయ్యారు. గతంలో మిరప, మినుము, తదితర పంటలను రైతులు అధికంగా సాగుచేసేవారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల ప్రభావం, దిగుబడులు రాకపోవడం, కల్తీ విత్తనాలు, తదితర కారణాల వలన 70 శాతం మందికిపైగా రైతులు ఈ ఏడాది ఇతర పంటల సాగుకు స్వస్తి పలికారు. ఏళ్ల తరబడి సాగు చేసిన పంటలకు బదులుగా పొగాకు పంటను ఎంచుకున్నారు. ప్రస్తుతం మార్కెట్లో మంచి డిమాండ్ ఉండటంతో పాటు దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉండటంతో రైతులు పొగాకు పంటపై బోలెడాశలు పెట్టుకున్నారు.

ఎకరాకు రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకు ఖర్చు...

సంతనూతలపాడు నియోజకవర్గంలోని సంతనూతలపాడు, చీమకుర్తి, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల్లో దాదాపు 3,490 హెక్టార్లకుపైగా ఈ ఏడాది వర్షాధారంగా పొగాకు పంట సాగు చేశారు. బోరు బావుల కింద గత కొన్నేళ్లుగా సాగు చేస్తున్న సంప్రదాయ పంటలకు స్వస్తి చెప్పి తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తుందనే ఆశతో పొగాకు పంటను ఎంచుకున్నారు. దీని సాగుకు ఎకరాకు రూ.60 వేల నుంచి రూ.80 వేల దాకా ఖర్చవుతుండగా, నీటి తడులున్న పొలాలైతే 10 నుంచి 12 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. వర్షాధారంగా సాగుచేసిన పొలాల్లో 5 నుంచి 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. పైగా, పొగాకు కంపెనీలే రైతుల నుంచి నేరుగా క్వింటాను రూ.20 వేలకుపైగా కొనుగోలు చేస్తామని చెప్పడంతో లాభాలు బాగా ఉంటాయన్న ఆశతో రైతులు జోరుగా పొగాకు సాగు చేశారు.

కూలీలకు పెరిగిన డిమాండ్...

ఈ ఏడాది పొగాకు సాగు విస్తీర్ణం భారీగా పెరగడంతో కూలీలకు కూడా డిమాండ్ పెరిగింది. పంట ఆకులు నాణ్యంగా వచ్చిన వెంటనే రైతులు వాటిని తొలగించడంతో పాటు కుట్టి ఆరబెట్టాలి. అందుకోసం ఒక్కో కూలీకి రోజుకు రూ.700 నుంచి రూ.900 చొప్పున చెల్లించాల్సి ఉంది. పొగాకు కోతలన్నీ ఒకేసారి రావడంతో కూలీలకు డిమాండ్ విపరీతంగా పెరిగిపోయింది. దీంతో కొన్ని గ్రామాల్లో కూలీలు దొరకక రైతులే సొంతంగా పనులు చేసుకుంటున్నారు.

60 నుంచి 70 రోజుల్లో పంట కోత...

పొగాకు పంట సాగుకు కంపెనీ వాళ్లు విత్తనాలిస్తే నారు పోసుకోవాలి. 60 రోజులకు నారు వస్తుంది. సాళ్లు తోలుకుని వర్షం పడిన తర్వాత నాటాలి. నీటి వసతి ఉంటే నీళ్లు కట్టిన తర్వాత నాటుకోవాలి. నాటుకున్న తర్వాత ఒకసారి భూమి మందు వేయాలి. ముఖ్యంగా పొగాకుకు లద్దె పురుగు ఎక్కువగా సోకుతుంటుంది. పురుగు నివారణకు ఒకటి నుంచి రెండు సార్లు మందు పిచికారీ చేసుకోవాలి. 60 నుంచి 70 రోజుల్లో ఆకులు కోతకు వస్తాయి. 20 నుంచి 25 రోజులకోసారి ఒక కోత చొప్పున 4 నుంచి 5 కోతల దాకా వస్తాయి. కోత కోసి తోరణాలుగా కట్టి ఆరబెట్టిన తర్వాత మార్కెట్‌కు తరలిస్తారు. కంపెనీలతో ముందుగా చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం క్వింటా పొగాకుకు నాణ్యతను బట్టి రూ.18 వేల నుంచి రూ.25 వేల వరకు ధర పలుకుతోంది. పొగాకు ఎకరా సాగుకు నారు విత్తేందుకు, కలుపులకు మందులతో కలిసి రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకు పెట్టుబడి అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు.



కోత తర్వాత పొగాకును కర్రకు కడుతున్న కూలీలు

లాభాలు వస్తాయని ఆశ



మూడేళ్ల నుంచి పొగాకు పంట సాగుచేస్తున్నా. మంచి లాభాలే వస్తున్నాయి. గతేడాది ఎకరాకు ఏడు క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ఈ ఏడాది మరింత ఎక్కువ దిగుబడి వస్తుందని ఆశిస్తున్నా. అయితే ఈ ఏడాది చాలా మంది రైతులు పొగాకు సాగు చేయడంతో కూలీలకు డిమాండ్ ఏర్పడింది. కూలి రేట్లు పెరిగాయి.

– వెన్నపూస శ్రీనివాసరెడ్డి, సంతనూతలపాడు

కూలీల ఖర్చు విపరీతంగా పెరిగింది



పొగాకు సాగుతో మంచి లాభాలే వస్తున్నాయి. ప్రస్తుతం కోత దశకు చేరడంతో ఆకులన్నీ కట్ చేసి ఎండబెడుతున్నాం. ఈ ఏడాది పెరిగిన కూలి ధరలతో ఖర్చు విపరీతంగా పెరిగింది. ఒక్కో కూలీకి ఆకులు తెంపి కర్రకు కట్టేందుకు రూ.500 వరకూ చెల్లిస్తున్నాం. మొత్తంమీద పెట్టుబడులు బాగా పెరిగాయి.

– కసిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సంతనూతలపాడు



పొగాకు కొట్టడానికి వెళ్తున్న కూలీలు



ఎడ్లతో పొగాకు సాళ్లు చేస్తున్న రైతులు

చట్టబద్ధత లేని వర్గీకరణ చెల్లదు

- తప్పుడు కుల గణనతో మాలలను మాదిగలుగా చూపేందుకు కుట్ర
- రాజీవ్ మిశ్రా కమిషన్‌కు విన్నవించిన చీమకుర్తి మాలల సంఘ నాయకులు, ఉద్యోగులు



వినతిపత్రం అందిస్తున్న చీమకుర్తి మాల సంఘ నాయకులు, ఉద్యోగులు

చీమకుర్తి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వర్గీకరణ అంశానికి చట్టబద్ధత లేదని, కులగణన ద్వారా చేపట్టే ఎస్సీ వర్గీకరణ చెల్లదని చీమకుర్తి మాలల సంఘాల నాయకులు, ఉద్యోగులు రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌కు తేల్చి చెప్పారు. ఎస్సీ సామాజిక వర్గాన్ని కులగణన ద్వారా వర్గీకరించేందుకు ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ అయిన రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ సోమవారం ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చీమకుర్తి మాలలు పాల్గొని సమస్యలతో కూడిన వినతిపత్రాలు అందించారు. ఒక పక్క వలంటీర్ల వ్యవస్థకు చట్టబద్ధత లేదని ప్రభుత్వం చెబుతూనే.. మరోవైపు అదే వలంటీర్ల వ్యవస్థ రూపొందించిన జనాభా లెక్కల గణాంకాలను ముందు పెట్టి ఎస్సీ సామాజిక వర్గీకరణ చేపట్టాలని చెప్పడం హాస్యాస్పదమని ప్రభుత్వ తీరును వినతిపత్రంలో దుయ్యబట్టారు. ఎస్సీ సామాజికవర్గంలో మాలల సంఖ్య తగ్గించేందుకు మాలలను ఎస్సీ క్రిస్టియన్లుగా, మాదిగలుగా, ఆది ఆంధ్ర మాలలుగా చూపే కుట్రకు ప్రభుత్వం పాల్పడుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలతో కులగణన చేపడితే ఎస్సీ సామాజికవర్గం జనాభా 25 శాతం పెరుగుదల ఉంటుందన్నారు. పెరిగిన 25 శాతం దామాషాకు తగ్గట్టుగా ఎస్సీలకు 25 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని మాల సంఘాల నాయకులు రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాల సంఘాల నాయకులు, ఉద్యోగులు బండ్ల డేవిడ్, పిల్లి కోటేశ్వరరావు, వేమా బాలకోటేశ్వరరావు, వేమా చినకోటేశ్వరరావు, పొత్తూరి బాలకోటేశ్వరరావు, ఇస్తర్ల శంకర్, దాసరి రవి ఉన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు లక్కీ డ్రా



లక్కీ డ్రా తీస్తున్న డిపో మేనేజర్ శ్రీనివాసులు

ఒంగోలు టౌన్: ఏపీఎస్ఆర్టీసీ పల్లెవెలుగు బస్ సర్వీసుల ప్రయాణికులను ప్రోత్సహించే లక్ష్యంతో ప్రతి 15 రోజులకు ఒకసారి లక్కీ డ్రా నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తున్నట్లు ఒంగోలు డిపో మేనేజర్ డి.శ్రీనివాసులు తెలిపారు. సోమవారం స్థానిక ఆర్టీసీ డిపోలో లక్కీ డ్రా తీసి విజేతలను ప్రకటించారు. ఈ డ్రాలో తాళ్లూరు రూట్‌కు సంబంధించి ఒంగోలుకు చెందిన టి.సాంబశివరావు, కొణిజేడు, పొందూరు రూట్లకు సంబంధించి కొణిజేడుకు చెందిన పి.రమాదేవి, గుండాయపాలెం బస్సు రూట్‌కు సంబంధించి కరవదికి చెందిన జి.వెంకటేశ్వరరావులకు బహుమతులు లభించాయి. విజేతలకు సీఎంఆర్ జ్యూయలరీస్ వారు బహుమతులు అందించినట్లు డిపో మేనేజర్ తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపరింటెండెంట్ ఆర్ఎం నాయక్, బీఎస్ఎం బీవీ నాయక్, టీఐ వై.ప్రభాకరరావు, కంట్రోలర్ ఎస్.ప్రసాదరావు, సీఎంఆర్ జ్యూయలరీస్ అధినేత మావూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆంజనేయస్వామికి పూజలు



పూజలందుకుంటున్న మర్రిచెట్టు పొలిమేర అభయాంజనేయస్వామి

ఒంగోలు మెట్రో: పుష్య మాసంలో ఆంజనేయ స్వామి జన్మనక్షత్రం పూర్వాభాద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా వ్యాప్తంగా ఆంజనేయస్వామి ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలను వైభవంగా నిర్వహించారు. స్థానిక కేశవస్వామిపేటలోని వీరాంజనేయ స్వామి దేవస్థానంలో, రాంనగర్‌లోని ఆంజనేయ స్వామి దేవస్థానంలో, లాయర్‌పేట రైతు బజార్ దగ్గర చిట్టి ఆంజనేయస్వామి మందిరంలో, మంగమూరురోడ్డు ఐశ్వర్యనగర్‌లో, పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో, నెహ్రూకాలనీలోని ప్రసన్నాంజనేయస్వామికి, జిల్లా కోర్టు దగ్గర వీరాంజనేయస్వామి దేవస్థానంలో, గద్దలగుంటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో, మంగమూరు రోడ్డు పొలిమేర అభయాంజనేయ దేవస్థానంలో మూలవిరాట్లకు మన్యసూక్తంతో సుగంధ పరిమళ ద్రవ్యాలు, పంచామృతాభిషేకాన్ని నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరణ చేసి భక్తిశ్రద్ధలతో అష్టోత్తర శతనామావళి పూజా క్రతువులు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అర్చకులతో వేదఆశీర్వచనం అందుకున్నారు.

పొన్నూరు శ్రీనివాసులుకు సన్మానం



పొన్నూరు శ్రీనివాసులును సన్మానిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: హాస్యబ్రహ్మ పద్మశ్రీ రేలంగి, పద్మశ్రీ ఘంటసాల కళావేదిక ప్రారంభోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ వ్యాఖ్యాత, ఉగాది పురస్కార గ్రహీత పొన్నూరు వేంకట శ్రీనివాసులును, సీనియర్ వ్యాఖ్యాత సయ్యద్ ఇస్మాయిల్‌ను కళావేదిక అధ్యక్షుడు వి.కనకారావు ఘనంగా సత్కరించారు. స్థానిక సీవీఎన్ రీడింగ్ రూంలో సోమవారం ప్రథమ కానుకగా నిర్వహించిన సంగీత విభావరిలో గాయకులు సి.రామకోటేశ్వరరావు, పురాణం సుబ్రహ్మణ్యం, జి.మస్తానయ్య బి.వెంకటేశ్వర్లు, ఆకుల శ్రీనివాసరావు, కనకారావు, లక్ష్మీతులసి, శైలజ పాడిన పాటలు ప్రేక్షకులకు అలరించాయి. కీబోర్డుపై జెర్మియా, తబలాపై శివ, రిథంప్యాడ్‌పై సురేష్, జాజ్‌పై మోహన్‌రావు వాద్య సహకారాన్ని అందించారు. పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు పాల్గొని గాయకులను అభినందించారు.

రెవెన్యూ సదస్సుకు 88 అర్జీలు



సర్టిఫికెట్లు అందిస్తున్న తహసీల్దార్ మధుసూదన్‌రావు

కొత్తపట్నం: మండలంలోని పాదర్తి గ్రామంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 88 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ పి.మధుసూదన్ రావు తెలిపారు. క్యాస్ట్, ఇన్‌కమ్ సర్టిఫికెట్ల కోసం 16, కుటుంబ సభ్యుల పత్రాల కోసం 3, మ్యుటేషన్ కోసం 5, భూమి ఆన్‌లైన్ సబ్‌డివిజన్ కోసం 38, ఎఫ్ లైన్ కోసం 26 అర్జీలు వచ్చినట్లు వివరించారు. సదస్సులోనే 19 అర్జీలు పరిష్కరించినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల పత్రాలు 3, క్యాస్ట్, ఇన్‌కమ్ 16 పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ వరప్రసాద్‌రావు, రైతులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇస్తిమా జరుపుకోవాలి



ఇస్తిమా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: నెల్లూరు, ప్రకాశం జిల్లాల ఇస్తిమాను ప్రశాంతంగా జరుపుకునేలా ముస్లింలకు అన్ని విధాలుగా తోడ్పాటునందిస్తామని ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఇస్తిమాకు లక్ష మందికిపైగా హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని చెప్పారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐ కాలేజీ ఆవరణలో ఇస్తిమాకు జరుగుతున్న ఏర్పాట్లను సోమవారం ఎస్పీ పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తుతో పాటు పోలీసు కంట్రోలు రూం కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇస్తిమా జరిగే వేదిక చుట్టూ పరిసరాలు, ప్రవేశ మార్గములు, పార్కింగ్ స్థలాలను పరిశీలించి బందోబస్తు ఏర్పాట్లపై పోలీసు అధికారులతో సమీక్షించారు. వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో ముస్లింలు తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందుగానే పార్కింగ్ ప్రదేశాలను గుర్తించాలని, ఆయా రూట్లలో వచ్చే వాహనాలను ఎక్కడికక్కడ పార్కింగ్ చేసుకునేలా సూచిక బోర్డులు, లైటింగ్, బారికేడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇస్తిమా కమిటీ నాయకుడు సయ్యద్ హనీఫ్ ఎస్పీకి ఇస్తిమాకు సంబంధించిన వివరాలు తెలియజేశారు. భక్తిశ్రద్ధలతో ఇస్తిమా జరుపుకోవాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఎస్పీ వెంట డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, రూరల్ సీఐ శ్రీకాంత్ బాబు, తాలూకా సీఐ అజయ్ కుమార్, వన్‌టౌన్ సీఐ నాగరాజు, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, ఇస్తిమా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వయం సహాయక గ్రూపుల ఆదాయంపై సర్వే చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న పీడీ రవికుమార్

ఒంగోలు వన్‌టౌన్: స్వయం సహాయక గ్రూపుల ఆదాయంపై సర్వే నిర్వహించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ టి.రవికుమార్ అన్నారు. ఒంగోలు టీటీడీ సెంటర్‌లో సోమవారం వీఓఏలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పీడీ పాల్గొని మాట్లాడారు. సంస్థాగత నిర్మాణం విభాగంలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. మొబైల్ బుక్ కీపింగ్, గ్రూపుల గ్రేడింగ్, రికవరీలను వెంటనే చేపట్టాలన్నారు. మొబైల్ బుక్ కీపింగ్‌లో రాష్ట్రంలోనే మూడో స్థానంలో జిల్లా నిలిచిందన్నారు.38 మండలాల్లోని క్లస్టర్ సీసీల పరిధిలో ఒక వీఓఏ చొప్పున, 138 వీఓఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌డీఏ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

గోపాల మిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్

ఒంగోలు టౌన్: పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న గోపాల మిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఎన్.వీరాంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన గోపాల మిత్రుల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. గత 20 ఏళ్లుగా గ్రామాల్లో పశువులకు వైద్య సేవలు అందిస్తున్న గోపాల మిత్రులకు ఉద్యోగ భద్రత లేకుండా పోవడం దారుణమన్నారు. కనీస వేతనాలు అమలు చేయకపోవడంతో కుటుంబాలను పోషించుకోలేక గోపాల మిత్రలు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెలకు రూ.6,500 ఇస్తున్నారని, గత 6 నెలలుగా ఆ జీతం కూడా ఇవ్వకపోవడంతో పస్తులు ఉంటున్నారని చెప్పారు. గోపాల మిత్రలను పశువైద్యశాలలకు అటాచ్ చేసి కిట్ నిలిపివేయడంతో సకాలంలో పశువులకు వైద్యం అందక చనిపోతున్నాయని చెప్పారు. గోపాల మిత్రలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాడి పరిశ్రమను నిలబెట్టడంలో గోపాల మిత్రల కృషి మరచిపోలేమని డాక్టర్ వంశీ అన్నారు. అనంతరం గోపాలమిత్ర యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా జి.రాంబాబు, కార్యదర్శిగా ఎస్.సాంబశివరావు, కోశాధికారిగా పి.వెంకటరెడ్డి, మరో 10 మందితో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.

రజకులకు సిమెంటు పైపులు అందజేత



మారం వెంకారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న రజక సంఘ నాయకులు



మారం వెంకారెడ్డి అందించిన సిమెంటు పైపులు

చీమకుర్తి: రజకులకు ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి రూ.25 వేల విలువ చేసే సిమెంటు పైపులను సోమవారం అందించారు. సాగర్ కాలువ నుంచి రజకుల కుంటకు నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో తాము ఇబ్బంది పడుతున్నట్లు రజకుల సంఘ నాయకులు మారం వెంకారెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. వారి విజ్ఞప్తి మేరకు రూ.25 వేల విలువ చేసే సిమెంటు పైపులను అందించి రజకుల కుంటకు కావాల్సిన సాగర్ జలాలు ప్రవహించేందుకు సహకరించారు. మారం వెంకారెడ్డికి రజకులు కృతజ్ఞతలు తెలిపారు.